ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 15 ఆగస్టు 2025



- 15-18 ఏళ్ల బాలికలతో ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు
- వృద్ధులు, దివ్యాంగులతో ప్రత్యేక గ్రూపులు
- బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చేలా నిర్ణయం
- నెలాఖరులోపు బ్యాంకు ఖాతాలు తెరిపించడమే లక్ష్యం

కిశోర బాలికల పొదుపు మంత్రం



జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భద్రత, సామాజిక గుర్తింపునిచ్చిన మహిళా సంఘాలు మరింత విస్తృత మవుతున్నాయి. 60 ఏళ్లు దాటిన కారణంగా గతంలో సంఘాల నుంచి తొలగించిన మహిళలకు తిరిగి సభ్యత్వం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా జిల్లాలో అధికారులు కార్యాచరణ చేపడుతున్నారు. దీంతో మళ్లీ సంఘంలో చేరి తమ అనుభవాన్ని, నైపుణ్యాన్ని తోటి సభ్యులతో పంచుకునే అవకాశం వృద్ధ మహిళలకు లభించనుంది. కిశోర బాలికలు, దివ్యాంగులు, వృద్ధులకు సహకార సంఘాల్లో సభ్యత్వం ఇచ్చేందుకు ప్రభుత్వ అనుమతి లభించింది. ఇందిరా మహిళా శక్తి మిషన్‌లో భాగంగా ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది.

● కిశోర బాలికలకు చాన్స్...

జిల్లాలో 15 నుంచి 18 ఏళ్లలోపు సుమారు 2 వేల మంది బాలికలు ఉన్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఈ బాలికలతో కిశోర బాలికల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి వారికి డబ్బులు పొదుపు చేయడంతో పాటు బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తారు. అలాగే హ్యూమన్ ట్రాఫికింగ్, మహిళలపై వేధింపులు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలతో పాటు విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ సంఘాల్లో బాలికలను చేర్పించడం కోసం సెర్ప్ అధికారులు, సిబ్బంది, పాఠశాలలు, కళాశాలల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు.

● దివ్యాంగ సంఘాల్లో పురుషులూ...

జిల్లా వ్యాప్తంగా సుమారు 1,47,103 లక్షల మంది దివ్యాంగులు చేయూత పింఛన్లు పొందుతున్నారు. స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా దివ్యాంగులందరినీ స్వయం సహాయక సంఘాల పరిధిలోకి తీసుకురాబోతున్నారు. వీరితో కూడా బ్యాంక్ ఖాతాలు తెరిపించడం, పొదుపు అలవాటు చేయడంతో పాటు సంఘాల ద్వారా ప్రభుత్వ పథకాలు అందేలా చూడనున్నారు. దివ్యాంగులకు అవసరమైన వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, ఇతర సహాయక పరికరాలను ఈ సంఘాల ద్వారా పంపిణీ చేసే అవకాశముంది. ఈ సంఘాల్లోని దివ్యాంగులకు మహిళా సంఘాలకు ఇచ్చినట్లే వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇవ్వనున్నారు. ఒక్కో సంఘంలో ఏడు నుంచి 10 మంది సభ్యులు ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. ఈనెలాఖరులోపు బ్యాంకు ఖాతాలు తెరిపించి లింకేజీ రుణాలు ఇవ్వడానికి అనుగుణంగా ప్రక్రియ చేపట్టారు.

● 60 ఏళ్లు దాటిన వారికి మళ్లీ అవకాశం..

ప్రస్తుతం 60 ఏళ్లు దాటిన మహిళలను స్వయం సహాయక సంఘాల నుంచి తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో 60 ఏండ్లు దాటిన మహిళలతో మళ్లీ కొత్తగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఏ ఆసరా లేని..

- మిగతా 8లో

జిల్లా వివరాలు..	
మొత్తం మండలాలు	20
స్వయంసహాయక మహిళా సంఘాలు	15,019
సభ్యులు	1,77,250
గ్రామైఖ్య మహిళా సంఘాలు..	565
మండల సమాఖ్య సంఘాలు	18
జిల్లా సమాఖ్య సంఘం	1

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో, పోలీసు ప్రధాన కార్యాలయ మైదానంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. దరూర్ క్యాంపులో గల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరం పోలీస్ పరేడ్, వందన స్వీకారం, ముఖ్య అతిథి సందేశం, సాతంత్ర్య సమరయోదులకు సత్కారం, వివిధ రంగాల్లో కృషి చేసిన వ్యక్తులకు ప్రశంసాపత్రాలను ప్రదానం చేయనున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, వందన సమర్పణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, ప్రజాప్రతినిధులు సందర్శించి పరిశీలన చేయనున్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ సత్యప్రసాద్, కలెక్టర్ అశోక్ కుమార్ తదితరులు పర్యవేక్షించారు. కలెక్టరేట్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, పోలీసు ప్రధాన కార్యాలయం తదితర వాటి వద్ద డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు చేశారు.

నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి గ్రామ గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు నేపథ్యంలో అధికారులు గోదావరి నదిని, పరివాహక గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో సలీం, పలువురు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి
పోరాటం
● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి
8
విద్యాసంస్థల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు
8
యూరియా కోసం రైతుల బారులు
8

సహకార సంఘాల పాలక వర్గాల పదవీ కాలం పొడిగింపు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గాల గడువును పొడిగిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 51 సంఘాల కాలపరిమితి, డీసీసీబీ చైర్మన్ పదవీ కాలాన్ని మరో ఆరునెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలక వర్గాల పదవీ కాలం ఈనెల 14తేదీతో ముగిసింది. పాలకవర్గ పదవీ కాలానికి ఆరు నెలల ముందే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. కాలపరిమితి ముగుస్తున్నా రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎన్నికకు సంబంధించిన ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో సహకార సంఘాల పాలకవర్గ గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ మండల, జిల్లా పరిషత్తులు, ముని పల్ పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. తాజాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సైతం ఆ జాబితాలో చేరుతాయని అంతా భావించారు. ఈ పరిస్థితుల్లో సహకార సంఘాల కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రఘు నందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు.

మెప్మా ఆర్‌పీల వేతన బకాయిలు చెల్లించాలి



అడిషనల్ కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం ఇస్తున్న మెప్మా ఆర్‌పీలు

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత, మెప్మా ఏఓ దుర్గపు శ్రీనివాస్ గౌడ్‌లకు మెప్మా రిసోర్స్ పర్సన్‌లు గురువారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత యేడాది మార్చి నుంచి జూలై మాసం వరకు గౌరవ వేతనాలు అందించాల్సి ఉందన్నారు. వెంటనే గౌరవ వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెప్మా ఆర్‌పీల సంఘం అధ్యక్షురాలు రమ, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలకు చెందిన ఆర్‌పీలు పాల్గొన్నారు.

గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాంఘికసంక్షేమ గురుకులాల్లో వసతులను మరింత మెరుగు పరచాలని అదనపు కలెక్టర్ బీఎస్ లతకు ఏబీవీపీ విద్యార్థులు వినతిపత్రం అందించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లతను కలిసి సమస్యను విన్నవించారు. జిల్లాలోని పలు గురుకులాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో జగిత్యాల ఏబీవీపీ నాయకులు నిఖిల్, మనోజ్, జస్వంత్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పోలీసులకు ఇండియన్ పోలీస్ మెడల్

● అభినందించిన ఎస్పీ



శ్రీనివాస్, ఏఎస్సై   కృష్ణకుమార్, ఏఎస్సై

జగిత్యాల క్రైం, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి): పోలీస్‌శాఖలో విశేషమైన సేవలందించినందుకు కేంద్ర ప్రభుత్వం అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌కు జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు పోలీస్ అధికారులు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 11మంది పోలీస్ అధికారులకు ఇండియన్ పోలీస్ మెడల్ రాగా జిల్లా నుంచి ఇద్దరు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా మెడల్‌కు ఎంపికైన స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్, మల్యాల ఏఎస్సై రుద్ర కృష్ణకుమార్‌లను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే పోలీసు అధికారులకు గుర్తింపు వస్తుందని అన్నారు.

బీజేపీ జిల్లా ఆఫీస్ బేరర్ల నియామకం

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆఫీస్ బేరర్స్ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రారావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా హనుమండ్ల కృష్ణహరి, చిన్నగోడు పెద్ద గంగారాం, ఎర్ర లక్ష్మీ, తుకారంగౌడ్, గుజ్జుల వేణుగోపాల రెడ్డి, మ్యాదరి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా వొడ్డెపల్లి శ్రీని వాసన్, పిల్లి శ్రీనివాస్, నలువాల తిరుపతిని నియమించారు.

జిల్లా కార్యదర్శులుగా కస్తూరి లక్ష్మీనారాయణ, భాగ్యలక్ష్మీ, బెజ్జారపు లవణ్, సాంబారి కళావతి, రాజేంధర్, పాత రమేష్, కోశాధికారిగా సుంకేటి దశరథరెడ్డి, ఆఫీస్ సెక్రెటరీగా జుంబర్తి దివాకర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సుంచు సురేష్, మీడియా కన్వీనర్‌గా భూమి రమణ, ఐటీ సెల్ ఇన్‌చార్జిగా బడుగు భూమేష్‌లను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు తెలిపారు. ఈ నూతన కమిటీని పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి

● పలువురు విద్యార్థులకు గాయాలు



హర్షవర్ధన్(ఫైల్)

తిమ్మాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెల్లారితే స్వాతంత్ర్య దినోత్స వం, సంతోషంగా ఇంటికి వెళ్లి ఉదయాన్నే జండవందనానికి వెళ్లాలని సంతోషంతో వెళ్తున్న విద్యార్థుల ఆటో కాసేపటిలో ఇంటి చేరుతామనే లోపే అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఓ విద్యార్థి మృతి చెందగా, పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు తిమ్మాపూర్‌లోని ఓ పాఠశాలలకు ఆదే గ్రామానికి చెందిన ఆటోలో వెళ్లి వస్తుంటారు. గురువారం కూడా స్కూల్‌కి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఇంటికి సమీపంలోకి రాగానే విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోకు కుక్క అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడి కొద్ది దూరం వరకు రోడ్డుకు రాసుకుంటూ పోయింది. ఆటోలో కుడి వైపున కూర్చున్న నాంపల్లి హర్షవర్ధన్ (10) నాలుగవతరగతి విద్యార్థి తలనేలకు రాక్కుంటూ వెళ్లింది. స్థానికులు వెంటనే అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు హర్షవర్ధన్ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు నాంపల్లి శ్రీనివాస్, సమత ఆసుపత్రి వద్ద రోదించడం అందరినీ కలిచివేసింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇతర విద్యార్థుల్లో కొందరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయాలు అలుముకొన్నాయి. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ అనిల్‌ను ఎల్ఎండీ పోలీసులు అదుపులోని తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

క్షణికావేశంలో పురుగుల మందు తాగి మహిళ బలవన్మరణం



సంధ్య (ఫైల్)

ధర్మారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూతురును ఎందుకు కొడుతున్నావని తల్లి మందలించడంతో క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కటికె నపల్లి గ్రామానికి చెందిన సంపంగి సంధ్య(25) మంగళవారం కూతురు వర్షిత అల్లరి చేస్తుందని కొప్పడుతూ చేయిచేసుకొంది. దీంతో సంధ్య తల్లి మామిడి సత్తమ్మ ఎందుకు కొడుతున్నావని మందలించింది. క్షణికావేశానికి లోనైన సంధ్య పత్తిచేను వద్దకు వెళ్లి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటుఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సంధ్య బుధవారం రాత్రి మృతి చెందింది. సంధ్య తల్లి మామిడి సత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రేకుర్తి కంటి ఆసుపత్రిలో విస్తృత సేవలు

● మెల్లకన్ను, కంటి క్యాన్సర్‌కు చికిత్సలు

● 26వ తేదీన ప్రారంభం



రేకుర్తి కంటి ఆసుపత్రి

భగత్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మదేకర్ ఉదార రేకుర్తి కంటి ఆసుపత్రిలో విస్తృత సేవలు ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను మినహాయిస్తే ఉత్తర తెలంగాణలో ఏ పట్టణంలో లేని అరుదైన చికిత్సలను రేకుర్తి కంటి ఆసుపత్రిలో ప్రారంభించనున్నారు. ఈ నెల 26వ తేదీన రేకుర్తి కంటి ఆసుపత్రిలో మెల్ల కన్నుతో పాటు, కంటి క్యాన్సర్ చికిత్స కోసం ఓక్యులోప్లాస్టీ చికిత్స లను అందుబాటులోకి తేనున్నారు. ప్రతీనెల ఒకరోజు ఈచికిత్సల కోసం వైద్యులు అందుబాటులో ఉండనున్నారు. దీనితో కంటి సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లకుండా రేకుర్తిలోనే చికిత్సలు అందించడానికి ఏర్పాట్లు చేశారు.

● మెల్ల కన్నుకు చికిత్స

లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో మెల్లకన్నుకు చికిత్సను ప్రారంభిస్తున్నారు. చిన్న పిల్లల్లో కంటి సమస్యలు, చిన్న పిల్లల్లో శుక్లమ్ (మోతె బిందు) కంటి నరానికి సంబంధించిన చికిత్స కోసం నిపుణులైన వైద్యులు వచ్చి చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

● కంటి క్యాన్సర్, ఓక్యులోప్లాస్టీ చికిత్స

కంటి క్యాన్సర్‌కు సంబంధించి ఓక్యులోప్లాస్టీ చికిత్సను ఈ నెల 26వ తేదీన రేకుర్తిలో చికిత్స అందించనున్నారు. కన్నులో అద్దంలో వలె తళుక్ మొదలవ్వగానే కళ్లలో తేడా తెలుస్తుంది. మెల్లకన్ను లక్షణం ఉంటుంది. కళ్లలో మునుపటి కన్నా చూపు తక్కువవు తుంది. కళ్ల నుంచి నీరుకారుతుంది పొద్దున లేవగానే కళ్లు ఎర్రబడే లక్షణాలు కనిపిస్తాయి. కనురెప్పలు వాటంతట అవే మూసుకు పోతాయి. ప్రోస్టేటిస్ చికిత్స, ఒకకన్ను చిన్నగా కనిపిస్తుంది, రేటినోబ్లాస్టోమాను (ఇది ఒక కంటి క్యాన్సర్ పండు) మొదటి దశలో కనుగొని చికిత్స ప్రారంభిస్తే రోగాన్ని నయం చేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

అవకాశాన్ని వినియోగించుకోవాలి

కొండా వేణుమూర్తి, చైర్మన్ రేకుర్తి కంటి ఆసుపత్రి



రేకుర్తి కంటి ఆసుపత్రిలో మెల్లకన్ను, ఓక్యులోప్లాస్టీ సేవలను రేకుర్తిలో ప్రారంభిస్తున్నాము. కొత్తగా సర్జికల్ రెటినా సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌కు రాష్ట్రపతి మెరిటోరియస్ అవార్డు



ఎస్ ఆంజనేయరాజు



గోపాల్‌రెడ్డి

జ్యోతినగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగుండం ఎన్టీపీసీ యూనిట్ సెంట్రల్‌ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) డిప్యూటీకమాండెంట్ ఎస్.ఆంజనేయ రాజుకు ప్రతిష్ఠాత్మక ప్రెసిడెంట్ మెరిటోరియస్ సర్వీస్‌మెడల్ లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీపీసీ ప్రాజెక్టులో సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్‌గా పని చేస్తున్న ఆంజనేయరాజు ఉత్తమ సేవలను గుర్తించిన కేంద్రం రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ పతకానికి ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం(ఢిల్లీ) నుంచి సర్క్యులర్ విడుదలైంది. ప్రెసిడెంట్ మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపికైన ఆంజనేయరాజును సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిసి ఒవికె.శాస్త్రి, అధికారులు, జవానులు, ఎన్టీపీసీ అధికారులు అభినందించారు.

రాష్ట్రపతి మెడల్‌కు ఎంపికైన జమ్మికుంట ఫైర్ ఆఫీసర్

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంట అగ్నిమాపక కేంద్రంలో పనిచేసే లీడింగ్ ఫైర్ ఆఫీసర్ బి గోపాల్‌రెడ్డి రాష్ట్రపతి మెడల్‌కు ఎంపియ్యారు. ఆయన 33 సంవత్సరాలు ఫైర్‌స్టేషన్‌లో విధుల నిర్వహిస్తున్నాడు. వివిధ అగ్నిప్రమాదాల్లో ఆయన ప్రాణ, ఆస్తి నష్టనివారణలో విశేష సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు గతంలో ఉత్తమ సేవా పతకం అందించింది. ఈసందర్భంగా ఆయనను జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఎం శ్రీనివాస్‌రెడ్డి, జమ్మికుంట అగ్నిమాపక సిబ్బంది అభినందించారు.

చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

జగిత్యాలరూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గర్వంద శ్రీనివాస్(40) అనేడ్రైవర్ గురువారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. శ్రీనివాస్ పలువురి దగ్గర రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతోపాటు అతడిభార్య కవిత ఆరోగ్యం బాగాలేదని తరచూ బాధపడేవాడు. ఈనెల 12న శ్రీనివాస్ లక్ష్మీపూర్ శివారులోని ఆలయ సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నం చేశాడు. బంధువులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. భార్య కవిత ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన కన్నెబత్తుల చంద్రయ్య(82) కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం పనినిమిత్తం కట్టరాంపూర్ ఇంటినుంచి మానకొండూర్‌కు తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. బయటు దేరిన కొద్దిసేపటికే మానేరుబ్రిడ్జి నుంచి అలుగు నూర్ వైపువస్తున్న క్రమంలో గుర్తుతెలియనివాహనం చంద్రయ్య ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో చంద్రయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడచికిత్స పొందుతూమృతిచెందాడు. మృతుడు చంద్రయ్య బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై తెలిపారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

వీణవంక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన పానుగంటి ప్రమీల(56) వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. పోలీసులువివరాల ప్రకారం.. కొంతకాలంగా కటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రమీల బాత్‌రూమ్‌లోని రాడుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు మృతురాలు ప్రమీల భర్త విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేటకు చెందిన ఎలుకపల్లి అంజయ్య గల్ఫ్‌లో మరణించగా మృతదేహం గురువారం ఇంటికి చేరింది. సౌదీఅరేబియాలో గతనెల24న అంజయ్య మృతి చెందగా 22రోజుల తర్వాత మృతదేహం ఇంటికి చేరింది. సౌదీ అరేబియా నుంచి మృతదేహాన్ని ఇంటికి తరలించేందుకు కృషిచేసిన జాడి మల్లేశం, మహ్మద్ అబ్దుల్‌రఫిక్, షేక్ కలీం, మహమ్మద్‌కు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. కాగా గల్ఫ్‌బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గల్ఫ్ జేఏసీ రాష్ట్రకార్యదర్శి బూత్కూరి కాంత డిమాండ్ చేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పరిధిలోని కొత్తపల్లికి చెందిన కేతిరెడ్డి శ్రీలత ఇంటి ఎదుట గల సీసీ కెమోరాలు, కారు అద్దాలను పగలగొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామనికిచెందిన శ్రీలత సంవత్సర కాలంగా కొత్తపల్లిలో ఉంటోంది. శ్రీలత అన్న మాడ కృష్ణారెడ్డితో ఆస్తులకు సంబంధించిన గొడవలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కోర్టులో కేసులు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి మాడ కృష్ణారెడ్డి శ్రీలత ఇంటికి వెళ్లి సీసీ కెమోరాలు ధ్వంసం చేసి ఇంట్లో ఎవరూలేని సమయంలో తలుపులు బద్దలు కొట్టి యాభై వేయిల రూపాయలు సెల్‌ఫోన్ తీసుకోని ఇంటి ముందు కారు అద్దాలు పగలగొట్టినట్టు శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పత్తి చేను ధ్వంసం

● పలువురిపై కేసు నమోదు

కోనరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అకారణంగా పత్తి చేను ధ్వంసం చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన మండే ఎల్లయ్య అనే రైతుకు చెందిన సుద్దాల గ్రామ శివారులోని 403 సర్వేనెంబర్‌లో ఎకరం 30 గుంటలు ఉండగా, అందులో పత్తిచేను సాగు చేస్తున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్‌కు చెందిన కుడుకల రాములు, ఎల్లయ్య, మంజుల, మరికొంత మంది పత్తి చేను ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన వారిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

నమ్మించి క్రెడిట్ కార్డుల డబ్బుల స్వాహా

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు ● వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ నరసింహారావు



నిందితుడి అరెస్టు చూపిస్తున్న హనుమకొండ ఏసీపీ నరసింహారావు

వరంగల్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డుల ద్వారా కమీషన్ తీసుకోకుండా డబ్బులు ఇప్పిస్తానంటూ బాధితుల నుంచి లక్షల్లో డబ్బులు స్వాహాచేసిన మోసగాడిని హనుమకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ నరసింహారావు వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లాజమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన నిందితుడు నేరెళ్ల అరుణ్ 2023వలో హనుమకొండ రాయపురలో భద్రకాళి డిజిటల్ సేవా షాప్‌పెట్టి ఆన్‌లైన్ అప్లికేషన్స్ చేసేవాడు. తరువాత ఇన్‌స్టాముద్ర యాప్‌కి, షాద్వాల్ పే యాప్‌కి ఫీజు కట్టి డిస్ట్రిబ్యూటర్ ఐడీ తీసుకున్నాడు. తన దగ్గరికి డబ్బు అవసరం నిమిత్తం వచ్చే కస్టమర్ల క్రెడిట్ కార్డు స్వైప్ చేసి వారికి డబ్బులు ఇచ్చేవాడు. దానికి గాను వీసా కార్డుకి 1.8శాతం, మాస్టర్ కార్డుకి 2.6శాతం బిజినెస్ కార్డు 4శాతం, రూపే కార్డుకి 1.8శాతం వారీగా డబ్బులు తీసుకునేవాడు. తన దగ్గరికి తరచుగా వచ్చే కస్టమర్లను తన వ్యాలెట్‌లో యాడ్ చేసుకొని వారి క్రెడిట్ కార్డులలో బ్యాలెన్స్ ఉంటే వారికి ఫోన్ చేసి తాను వేరే పేమెంట్ చేసేది ఉందని చెప్పి.. వారి కార్డులు స్వైప్ చేసి వారికి ఎటువంటి చార్జెస్ లేకుండా తానే వారి క్రెడిట్ కార్డుల బిల్లులు కడతానని వారిని మోసపూరితంగా మాయమాటలుచెప్పి నమ్మించేవాడు. కార్డులు స్వైప్ చేసిన తరువాత వేరే కస్టమర్ల కార్డులు పేమెంట్ చేసి దానికి 4శాతం వరకు చార్జి తీసుకొని లాభపడేవాడు. తరువాత తన బ్యాంకు ఖాతా హోల్డ్ అయ్యిందని, రెండు రోజుల తరువాత ఎటువంటి కమీషన్ లేకుండా వారికి ఇస్తానని నమ్మించి కొన్నిరోజుల తరువాత వారి క్రెడిట్‌కార్డు బిల్లులు కూడా తానే కట్టేవాడు. యేడాదిపాటు వారికి నమ్మకంగా ఉంటూ వారి క్రెడిట్‌కార్డు బిల్లులు కడుతూ క్రెడిట్ కార్డులు స్వైప్ చేస్తూ అలా బాధితుల డబ్బుల నుంచి తన క్రాప్‌లోన్, అప్పులు కట్టి తన కుటుంబసభ్యులకు కూడా డబ్బులు సర్దుబాటు చేసేవాడు. అలా కస్టమర్ల క్రెడిట్ కార్డుల నుంచి సుమారుగా సుమారుగా రూ.28లక్షలు వాడుకున్నాడు. కస్టమర్లు ఫోన్‌చేయడంతో వారికి రేపుమాపు అంటూ దాటవేస్తూ వచ్చాడు. ఆ తరువాత తనవల్ల కాకపోవడంతో కొన్నిరోజులు ఎటైనా వెళ్లిపోతే కస్టమర్లు మర్చిపోతారనుకున్నాడు. తనువేసుకున్న పథకం ప్రకారం షాప్‌మూసేసి విజయవాడకు వెళ్లాడు. గురువారం షాపు వద్దకు వచ్చి ఖాళీచేస్తుండగా పోలీసులు నిందితుడుని పట్టుకొని అదుపులోకి తీసుకొనివిచారించగా తన నేరాన్ని అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన హనుమకొండ పోలీస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ఇల్లంతకుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరులో ఎరువుల విక్రయకేంద్రాలపై కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో గురువారం గ్రామంలోని నాలుగు ప్రైవేట్‌ఎరువుల దుకాణాలతో పాటు డీసీఎంఎస్ కేంద్రాలను తనిఖీలు చేశారు. తనిఖీలలో ఈపాస్ గ్రౌండ్ బ్యాలెన్స్ స్టాకులకు సరిపోని ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశారు. అనుమతిలేని గోదాములలో నిలువ ఉంచిన రూ 19,71,514 విలువైన యూరియా, డీఏపీ తదితర రసాయనిక ఎరువులను సీజ్‌చేశారు. మండలంలో యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. తనిఖీలలో విజిలెన్స్ తహసీల్దార్ దినేష్‌చంద్రారెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు అనీల్‌కుమార్, వరుణ్‌ప్రసాద్, మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన సంపత్ (35) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 10న బొంపల్లి గ్రామ శివారులో కారు ఢీకొనగా సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి సోదరి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి చికిత్సపొందుతూ ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని మల్యాల గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు వివరాల మేరకు ఉల్లి శ్రీనివాస్(40) మద్యానికి బానిసయ్యాడు. బుధవారం అతిగా మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య కోమల మద్యం తాగవద్దని సూచించింది. దీంతో మద్యం మత్తులో ఉన్న ఆయన ఇంటిలోని గడ్డి మందుతాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం శ్రీనివాస్ మృతిచెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మంథని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిట్టం వెంకటేష్ (30) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన వెంకటేష్ మరోముగ్గురు స్నేహితులతో కలిసి మంథనికి వచ్చి తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి ఎగిరి కిందపడిన వెంకటేష్‌పై నుంచి లారీ వెనుక టైర్ వెళ్ళడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. మంథని మండలం ధర్మారం గ్రామానికిచెందిన తిప్పాని అబిలాష్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం గోదావరిఖనికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుభాష్ నగర్‌కుచెందిన రెండ్లపద్మ ఆగస్టు12న తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీపులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ రూరల్ పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా వరంగల్‌లో ఉన్నట్లు గుర్తించి, దానినిస్వాధీనం చేసుకున్నారు. గురువారం రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి పద్మకు ఫోన్‌ను అప్పగించారు. కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

ఏఎంసీ గోదాంలో అదుపులోకి వచ్చిన మంటలు

● ఐదు రోజులు రాత్రింబవళ్లు శ్రమించిన అధికారులు



మెట్‌పల్లి ఏఎంసీ గోదాంలో అదుపులోకి వచ్చిన మంటలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలోని గోదాంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో చెలరేగిన మంటలు గురువారం అదుపులోకి వచ్చాయి. రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంలో ఉన్న గోనె సంచులు దగ్ధం కాగా గోదాం పూర్తిగా దెబ్బతింది. ఐదు రోజుల నుంచి మెట్‌పల్లి, జగిత్యాల, నిర్మల్, భీంగల్, ఖానాపూర్ అగ్నిమాపక కేంద్రాల నుంచి మంటలు ఆర్పడానికి వాహనాలను రప్పించారు. అగ్ని ప్రమాదంలో మంటలు చెలరేగడంతో గోదాం చుట్టూ ఉన్న గోడలు ధ్వంసం చేసి పై భాగంలోని రేకులను తొలగించారు. ఎక్స్‌కవేటర్లతో కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేసి మళ్లీ మంటలు రాకుండా వాటిని ఇసుకతో కప్పివేశారు. ఆరు అగ్నిమాపక యంత్రాలు, పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది ఐదు రోజుల పాటు రాత్రింబవళ్లు శ్రమించి మంటలు అదుపు చేశారు. 2018 సంవత్సరం నుంచి మార్కెట్‌యార్డు గోదాంను సివిల్ సప్లయిస్ శాఖ వారు అద్దెకు తీసుకొని అందులో గోనె సంచులను నిల్వ చేస్తున్నారు. అందులో ఉన్న 9.70లక్షల సంచులు కాలిపోవడంతో రూ.97లక్షలు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. అదేవిధంగా గోదాం దెబ్బతిని మరో రూ.70లక్షల వరకు ఆస్తి నష్టం నష్టం వచ్చిందన్నారు. గోనె సంచులు, గోదాంలకు ఇన్సూరెన్స్ ఉందని, సంబంధిత అధికారులు పరిశీలించినట్లు సివిల్‌సప్లయిస్, మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు. ప్రమాదంపై సివిల్‌సప్లయిస్, మార్కెట్ కమిటీ శాఖ వారు వేర్వేరుగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. గోదాంలో మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని తహసీల్దార్ నీత తెలిపారు. మంటలను ఆర్పే కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ కూన గోవర్దన్, తహసీల్దార్ నీత, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, ఎస్సై కిరణ్‌కుమార్, గోదాం ఇన్‌చార్జి సురేష్, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు

వేములవాడ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భూమి తగాదాలలో కక్ష పెంచకుని ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ వేములవాడ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ గురువారం తీర్పునిచ్చారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన ముత్త ఎల్లయ్యకు గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో ఎల్లయ్య భార్య వెంకటలక్ష్మి, కుమారుడు శరత్‌కుమార్‌లు వ్యవసాయం చేసకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన దేశవేణి లింగయ్యకు చెందిన భూమి మల్లయ్యకు చెందిన భూమిని ఆనుకుని ఉన్నది. హద్దుల విషయంలో కొంత కాలంగా గొడవలు జరుగుతుండగా పలుమార్లు పంచాయతీలు నిర్వహించినా పరిష్కారం లభించలేదు. ఈ తగాదాలు తొలగాలంటే ఎల్లయ్య కుటుంబాన్ని హత్య చేయాలని దేశవేని లింగయ్య, కనుకవ్వ, కనుకరాజు, శ్రీనివాస్ సరోజన, చొక్కాల తిరుమలు పథకం వేశారు. దీంతో 2020 డిసెంబరు 25వ తేదిన ఎల్లయ్య కుమారుడు శరత్‌కుమార్ తనపొలంలో ఒంటరిగా పనిచేస్తున్నాడని తెలుసుకున్న సదరు వ్యక్తులు పార, కర్రలు, రాళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటనపై తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి సీఐ వెంకటేష్ దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజిరెడ్డి కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి నిందితులు ఆరుగురికి ఐదు సంవత్సరాల జైలుశిక్ష, ఐదు వందల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రాసిక్యూషన్‌ను, దర్యాప్తు అధికారులను సీఎంఎస్ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ పేర్కొన్నారు.

తీరొక్క దేశాల నాణేలు

● 180దేశాల 1100నాణేలు, కరెన్సీల సేకరణ ● గిన్నీస్ రికార్డు లక్ష్యం ● గర్షకుర్తికి చెందిన మిట్టపల్లి నవీన్‌కుమార్





వివిధ దేశాల నాణేలు, సేకరించిన ఇతర దేశాల కరెన్సీతో నవీన్‌కుమార్

గంగాధర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన మిట్టపల్లి నవీన్‌కుమార్ 180 దేశాల 1100నాణేలు, కరెన్సీలను సేకరించి తనకంటూ గుర్తింపును సంపాదించుకున్నారు. 180దేశాలకు చెందిన 1100పాత, కొత్తరకాల నాణేలు, కరెన్సీలను సేరించాడు. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించాలని కోరి ఎంతటి కష్టమైన సేకరించాలని ప్రయత్నించి సఫలీకృతుడయ్యాడు. ఒకప్పటి రాజుల కాలం నాటి, బ్రిటీష్ కాలం నాటి చెల్లుబాటులో ఉన్న బిల్లలు, ప్రస్తుతం చెలామణిలో ఉన్న నాణేలతో పాటు కరెన్సీలను సంపాదించాడు. ఆయన సేకరించిన దేశాల్లో అమెరికా, దుబాయ్, లండన్, జపాన్, సింగపూర్ వంటి దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీ ఉన్నాయి. ఆయన 20సంవత్సరాలుగా వీటిని సేకరిస్తున్నాడు. ఈ కరెన్సీలు, నాణేల సేకరణలో తన స్నేహితుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నాడు. అయితే ఒక హాబీగా సేకరించిన ఈ నాణేలతో గిన్నీస్ రికార్డుగా నెలకొల్పాలన్నదే తన లక్ష్యమని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

పాఠశాలల్లో ఆధార్ నవీకరణ

విద్యార్థులకు ఎంతో సౌలభ్యం



విద్యార్థులకు ఆధార్ నవీకరణ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కరీంనగర్ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధార్ వివరాల్లో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా కరీంనగర్ రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఆధార్ నవీకరణ సాగుతోంది. పాఠశాలల్లోనే కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. కొంత మందికి ఆధార్ కార్డు లేక పోవడం, ఉన్నా అందులోని వివరాలు, పాఠశాలలో నమోదైనా వివరాలకు పొంతన లేకపోవడం వంటి పరిణామాలతో సమస్యలు తలెత్తాయి.

దీంతో యూడైస్‌లో నమోదుకు విద్యాశాఖ అధికారులు గందరగోళానికి గురవుతున్నారు. యూడైస్‌లో నమోదు చేసిన వారికే ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏక రూపదుస్తులు, రవాణా భత్యం, మధ్యాహ్న భోజనం వంటి వసతులు సమకూరుతాయి. ఈ నేపథ్యంలో ఆయా సమస్యలను అధిగమించడానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో అప్‌డేట్ ప్రక్రియ చేపట్టారు. ఆధార్ నవీకరణతోపాటు కొత్తగా నమోదు చేసుకోవచ్చు. మండలానికి ఒకరిని నియమించి ప్రతీ పాఠశాలకు వెళ్లేలా కార్యచరణ రూపొందించి అమలు చేస్తున్నారు.

గతంలోనూ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ఆధార్ అప్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించింది. ప్రైవేటు పాఠశాలల్లో కూడా యూడైస్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు ఉన్నాయి.

పాఠశాలల్లో ఆధార్ ప్రక్రియలో భాగంగా 2019-20 విద్యాసంవత్సరంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్లకు ఆధార్ నమోదు కిట్లను అందించినట్లు అధికారులు తెలిపారు. కరోనా ప్రభావంతో రెండేళ్ల ఈ కార్యక్రమం నిలిచిపోయిందని, 2023-24 విద్యాసంవత్సరంలో తిరిగి చేపట్టగా మండల వనరుల కేంద్రాల నిర్వాహకులకు ఈ బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. గతేడాది నుంచి ప్రైవేటు ఏజెన్సీలకు ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.



నిత్య జనగణమనకు ఎనిమిదేళ్లు..



జమ్మికుంట ప్రధాన కూడలిలో జాతీయగీతం ఆలపిస్తున్న ప్రజలు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో నిత్య జనగణమన ప్రారంభించి నేటికి ఎనిమిదేళ్లు పూర్తైంది. 2017ఆగస్టు 15న అప్పటి సీఐ పింగిలి ప్రశాంత్‌రెడ్డి నిత్య జనగణమన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు, మైక్ సెట్లు ఏర్పాటు చేశారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు అను సంధానం చేశారు. ప్రతిరోజు ఉదయం 7.30గంటల నుంచి దేశభక్తి గీతాలు వేస్తారు. 30 నిమిషాల పాటు దేశభక్తి గీతాలు వేసిన తర్వాత సరిగ్గా 8 గంటలకు జాతీయ గీతం ప్రారంభిస్తారు. ఆ సమయంలో ఎక్కడివారు అక్కడే నిలబడి జాతీయ జెండాకు వందనం చేస్తూ జనగణ మన ఆలపిస్తారు. ఎనిమిదేళ్లుగా జాతీయ గీతాన్ని ఆలపించడం సంతోషంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. దేశాన్ని గౌర వించుకోవడం మంచి విషయమని, ఇతర ప్రాంతాల వాసులు జమ్మికుంటను స్ఫూర్తిగా తీసుకొని నిత్య జనగణమన ప్రారంభించారు.



పాల్గొన్న నాయకులు, పోలీసు అధికారులు

స్ఫూర్తిగా తీసుకోవడం గొప్ప విషయం

ఎస్ రామకృష్ణగౌడ్, పట్టణ సీఐ

జమ్మికుంటను స్ఫూర్తిగా తీసుకొని ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో నిత్య జనగణమన నిర్వహించడం గొప్ప విషయం. ప్రతిరోజు ఉదయం 7.30గంటలకు పోలీస్‌స్టేషన్ నుంచి దేశభక్తి గీతాలు వినిపిస్తాం. సరిగ్గా 8గంటలకు జాతీయ గీతం ప్రారంభిస్తాం. ఆ సమయానికి ప్రజలందరూ ఎక్కడి వారు అక్కడే నిలబడి జాతీయ జెండాకు వందనం చేస్తూ జాతీయగీతం ఆలపిస్తారు. ఇక్కడి వారిని చూసి ఇతర ప్రాంతాల వారు సైతం దేశభక్తిని అలవరుచుకోవడం సంతోషంగా ఉంది.

కొనసాగుతున్న ఎత్తిపోతలు



గురువారం నాలుగు సిస్టర్న్స్ ద్వారా వెలువడుతున్న నీరు

ధర్మారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గోదావరిలోకి వరద నీరు పోటెత్తుతుండంతో నందిమేడారంలోని నంది పంప్‌హౌజ్ నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గోదావరి ఎగువప్రాంతాల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి 9848 క్యూసెక్కుల వరద నీరు వస్తుండంతో ప్రాజెక్ట్ నుంచి నందిమేడారం పంపుహౌజ్‌కు 9450 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. బుధవారం మూడు మోటార్లు ఆన్‌చేసి 9450క్యూసెక్కుల నీటినిఎత్తిపోసిన అధికారులు, గురువారం ఉదయంనుంచి మధ్యహ్నం వరకు 4మోటార్లు రన్‌చేసి నీటిని ఎగువకుతరలిస్తున్నారు. నీటినిల్వలకు అనుకూలంగా సాయంత్రం నుంచి 3మోటార్ల ద్వారానే ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌నీటిసామర్థ్యం20.175 టీఎంసీలు కాగా గురువారం వరకు 15.706 టీఎంసీలకు చేరుకుంది.

గాయత్రి పంపుహౌస్ కొనసాగుతున్న నీటి విడుదల

- మూడు పంపులతో 9450 క్యూసెక్కుల నీరు ఎస్సారార్ డ్యాంకు తరలింపు

రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి మిడ్ మానేరు డ్యాంకు నీటి విడుదల కొనసాగుతంది. బుధవారం మూడు పంపుల ద్వారా నీటి విడుదల ప్రారంభమైన విషయం విదితమే. గురువారం కూడా మూడుపంపుల ద్వారా నీటివిడుదలను కొనసాగిస్తున్నారు.

డెలివరి సిస్టమ్ నుంచి గ్రావిటీ కెనాల్‌నీటిని పంపించిన నీరు అక్కడినుంచి నేరుగా వరదకాలువ ద్వారా శ్రీరాజరాజేశ్వరడ్యాంకు పరవళ్లుతొక్కుతూ నీరు ప్రవహిస్తుంది. మూడు పంపులు ఒకేసారి విడుదల చేయడంతో వరద కాలువ నిండుగా ప్రవహించడంతో రైతుల కళ్లలో ఆనందం కదలాడుతుంది. ఒక్కో పంపు 3150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈనేపథ్యంలో మూడుపంపుల ద్వారా(0.29 టీఎంసీల) 9450 క్యూసెక్కుల నీటిని ఎస్సారార్ డ్యాంకు తరలిస్తున్నారు.

వరద కాలువ ఆయకట్టు రైతుల ఆనందం

గంగాధర: వరద కాలువకు నీరు విడుదలతో గంగాధర మండల పరిధిలోని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గాయంత్రి పంపు హౌస్ నుంచి మూడు పంపుల ద్వారా రోజుకు ఒక్కొక్క పంపు నుంచి 3350 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. వరదకాలువ నుంచి రెండు రోజులుగా 10వేల క్యూసెక్కుల నీరు మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. దీంతో వరదకాలువ ఆయకట్టు మండల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, కురిక్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, గర్షకుర్తి, గట్టుబూత్కుర్, ఆచంపల్లి గ్రామాల వ్యవసాయ పంటలకు వరద కాలువ నీరు వినియోగించుకోవచ్చు. వరద కాలువలో నీరుండటంతో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ప్రస్తుతం ఈ సీజన్‌లో ఇప్పటి వరకు వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో వరదకాలువకు అధికారులు నీరు విడుదల చేస్తుండగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి



నగరంలో మహిళలతో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

భగత్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్ కాలనీలలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా స్థానిక సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కోతిరాంపూర్, కట్టరాంపూర్, ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట రోడ్డుపైన అనేక గుంతలు ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మహిళలకు నెలకు 2,500రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. మహిళా సమస్యలు పరిష్కరించకపోతే అందరిని ఐక్యంచేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధానకార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ద్యావ అన్నపూర్ణ, గుడికందుల సంధ్య, మంచినీళ్ల లావణ్య, ఉప్పునూటి లక్ష్మి, స్రవంతి, భవాని, రజని, మున్నా, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పీడ్ గన్

- వాహనాల వేగం 80దాటితే చాలన్ పడ్డట్టే

తిమ్మాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజీవ్ రహదారిపై గురువారం తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ కలిసి స్పీడ్ గన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే స్పీడ్ గన్ ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనాల వేగం 80దాటితే చాలన్ పడుతుందని తెలిపారు. గురువారం మొదటి రోజు అతివేగంగా వెళుతున్న సుమారు 20వాహనాలకు స్పీడ్‌గన్ ద్వారా చాలన్‌లు పడినట్లు తెలిపారు. వాహనాదారులు వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని తెలిపారు.



స్పీడ్‌గన్‌ను పరిశీలిస్తున్న సీఐ సదన్ కుమార్, ఎస్సై శ్రీకాంత్ గౌడ్

గిరిజన తండాల్లో తీజ్ సంబరాలు

కోనరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల బతుకమ్మగా కొలిచే తీజ్ ఉత్సవాలను గిరిజన తండాల్లో గురువారం ఉత్సాహంగా జరుపుకున్నారు. యువతుల, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతిసంవత్సరం శ్రావణమాసంలో గిరిజనతండాల్లో మహిళలు తీజ్ ఉత్సవాలను జరుపుకుంటారు. గోధుమలను నానపోసి నారుగా పెరిగిన తర్వాత తొమ్మిదిరోజులపాటు ఉపవాసదీక్షలు యువతులు, మహిళలు చేసి కుటుంబసభ్యులు, పంటలు బాగుండాలని వేడుకొని మహిళలు గోధుమ నారును నెత్తిన పెట్టుకొని ఆయా చెరువులో నిమజ్జనం చేశారు.

గంభీరావుపేట: మండలంలోనిలింగన్నపేట తండాలో గురువారం తీజ్‌ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గోదుమనారుతో చేసిన బతుకమ్మలను సంప్రదాయ నృత్యాలతో తీసుకెళ్లి సమీప చెరువుల్లో నిమజనం చేశారు.

మల్లాపూర్ : మల్లాపూర్ మండల కేంద్రంలోని బంజారాలు భక్తిశ్రద్ధలతో తీజ్‌పండగను ఘనంగా జరుపుకున్నారు. గురువారం మల్లాపూర్ గ్రామశివారులో ప్రత్యేకపూజలు జరిపి వేడుకలు నిర్వహించారు. బంజారాలు తమసంప్రదాయం ప్రకారం ప్రత్యేకబుట్టలో గోధుమలనువేసి నిత్యం ఉదయం, సాయంత్రం తొమ్మిదిరోజులపాటు నీళ్లుపోసి పెంచారు. వాటిని అలంకరించిన బుట్టలో ఏర్పాటుచేసుకుని నెత్తినపెట్టుకొని సంప్రదాయ బద్ధంగా మహిళలు, యువతులు నృత్యాలుచేస్తూ చెరువులు, కుంటల వద్దకు వెళ్లారు. అక్కడ ప్రత్యేకపూజలు చేసి నిమజ్జనం చేశారు.



కోనరావుపేట గిరిజన తండాలో తీజ్ ఉత్సవాల్లో యువతులు



లింగన్నపేటలో తీజ్ ఉత్సవాల్లో మహిళలు



మల్లాపూర్‌లోని తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజన యువతులు, బాలికలు

భూ సేకరణ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్ల కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా మీదుగా వెళుతున్న జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ వేగవంతం చేయాలని, భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. భారత జాతీయ రహదారి సంస్థ ప్రాజెక్ట్ సంచాలకులు దుర్గాప్రసాద్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్ బాబుతో కలెక్టర్ పమేలా సత్పతి భూసేకరణ సమస్యలపై సమావేశం నిర్వహించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇదివరకే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని త్వరగా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సేకరణ విషయంలో అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి సేకరణకు సహకరించేలా చూడాలని అన్నారు. భూసేకరణలో ఉన్న సమస్యలన్నింటిని త్వరగా పరిష్కరించి జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని భారత జాతీయ రహదారి సంస్థకు స్వాధీనం చేయాలని సూచించారు.

పెన్సిల్ మొనపై త్రివర్ణ పతాకం

ఓదెల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడక గ్రామానికిచెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ 79వస్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పెన్సిల్ గ్రాఫైట్‌పై జాతీయజెండాను తయారుచేశారు. సుమారు గంట పాటు శ్రమించి నాలుగు మిల్లీమీటర్ల ఎత్తు రెండు మిల్లీమీటర్ల వెడల్పుఉన్న జాతీయ జెండాను తయారు చేశారు.



పెన్సిల్ మొనపై జాతీయ పతాకం

గతంలో చాక్‌పీస్‌పై 7 మిల్లీమీటర్ల ఎత్తు5మీ.మీ. వెడల్పుఉన్న జాతీయ జెండాను చెక్కి, రంగులు అద్దారు. చాక్‌పీసులపై హ్యాపీఇండిపెండెన్స్‌డే ఆంగ్లఅక్షరాలను 6మిల్లీమీటర్ల ఎత్తు 5మిల్లీమీటర్ల వెడల్పుతో గుండు పిన్ను సహాయంతో చెక్కారు. రజనీకాంత్ ఇంతకుముందు చాక్‌పీస్‌పై జాతీయ గీతం జనగణమన 278 అక్షరాలను, జాతీయ గేయం వందేమాతరం 284 ఆంగ్ల అక్షరాలను చాక్ పీస్, బియ్యపు గింజలపై రాశారు. అదేవిధంగా 1.5సెంటీమీటర్ ఎత్తు ఉన్న చాక్‌పీస్‌లపై 78జాతీయ జెండాలను తయారు చేశాడు. అదే విధంగా ఒకేచాక్‌పీసు పైరెండు మిల్లీమీటర్ల ఎత్తులో 78త్రివర్ణ పతాకాలను చెక్కారు. ఈ పెన్సిల్ గ్రాఫైట్ జాతీయజెండాను ప్రపంచంలోని వివిధ బుక్‌ఆఫ్‌రికార్డులకు ప్రతిపాదనలుపంపినట్లురజనీకాంత్ తెలిపారు.

సూక్ష్మ కళాకారుడి ప్రతిభ

- గుండు పిన్ను మొనపై జాతీయ జెండాతో పరుగెడుతున్న మహిళ విగ్రహం

జగిత్యాల క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌కు చెందిన డాక్టర్ గుర్రం దయాకర్ అనే సూక్ష్మకళాకారుడు తన ప్రతిభను చాటాడు. స్వాతంత్ర్య పర్వదినాన్ని పురస్కరించుకుని అత్యంత సూక్ష్మవిగ్రహం తయారు చేసి అబ్బురపరిచాడు. గుండుపిన్ను మొనపై జాతీయ జెండాను చేతితో పట్టుకుని పరుగెడుతున్న మహిళ సూక్ష్మ విగ్రహాన్ని తయారు చేశాడు. 10 గంటల సమయంలో మైనంతో పాటు పెన్సిల్ కలర్లు, గుండు పిన్ను ఉపయోగించి ఈ విగ్రహాన్ని తయారు చేసినట్లు సూక్ష్మ కళాకారుడు దయాకర్ తెలిపాడు.



గుండు పిన్నుపై జాతీయ పతాకం

బీసీ సంక్షేమ సంఘం నాయకుడి నిరసన

గణేశ్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేక మూతబడ్డ పాఠశాల స్థాయి బీసీ వసతి గృహాన్ని కళాశాల స్థాయి వసతి గృహంగా మార్చాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ప్లకార్డ్ పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలో గల పాఠశాల స్థాయి బీసీ బాలికల వసతి గృహాన్ని విద్యార్థులు లేరని మూసి వేశారన్నారు. సంరక్షణ అధికారిని ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై పంపారన్నారు. అధికారులు మూసివేసిన వసతి గృహాన్ని బీసీ బాలికల కళాశాల వసతి గృహంగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో..

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాసాగర్ ప్రాజెక్టులోకి గురువారం ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఎస్సారెస్పీలోకి 13,540 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. వానాకాలం పంటల సాగు కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను గురువారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,500 క్యూసె క్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 45.758 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిషన్‌భగీరథ, సాగునీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,088 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 600క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 75క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 180క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 502క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఇదిలా ఉండగా జూన్1వతేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 40.850 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 8.003 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.



శ్రీరాంసాగర్ ప్రాజెకు

ఎగువ మానేరు జలాశయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

- ప్రస్తుత నీటి నిలువ, ఇన్‌ఫ్లో తదితర అంశాలపై ఆరా..

గంభీరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గంభీ రావుపేట మండలం నర్మాల ఎగువమానేరు జలాశయాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి గురువారం సాయంత్రం పరిశీలించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో మానేరు ప్రాజెక్టును పరిశీలించి, ప్రస్తుత నీటినిలువ, ఇన్‌ఫ్లో తదితర అంశాలపై కలెక్టర్, ఎస్పీ ఆరాతీశారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం, నిలువ ఎంత, ఇన్‌ఫ్లో ఎంత అని నీటి పారుదలశాఖ అధికారుల నుంచి ఆరాతీశారు. ప్రాజెక్టు నీటిమట్టం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.3 టీఎంసీల నీరు ఉన్నాయని, ఎగువ నుంచి 400 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుందని, అధికారులు కలెక్టర్, దృష్టికి తీసుకెళ్ళారు. వరద ఇలాగే కొనసాగితే 10రోజుల్లో జలాశయం పూర్తిగా నిండుతుందని వారు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో 13వేల ఎకరాలకుపైగా సాగునీరు అందిస్తుందని, ఎడమ కాలువ కింద 700 ఎకరాలు, కుడి కాలువ కింద 12వేల ఎకరాలు సాగవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ డ్యాం గేట్లను పరిశీలించి, వాటి నిర్వహణను దగ్గరుండి పర్యవేక్షించారు. భారీవర్షాల నేపథ్యంలో నీటి పారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు సమయంతో అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నీటి మట్ట అంచనా వేస్తూ జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. డ్యాం పూర్తిగా నిండితే ఎక్కువైతే నీటిని కాలువల ద్వారా విడుదల చేయాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారి కిషోర్‌కుమార్, ఈఈ ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్ మారుతిరెడ్డి తదితరులు ఉన్నారు.



ఎగువ మానేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రతి మహిళను స్వశక్తి సంఘంలో చేర్పించాలి

మల్యాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళను స్వశక్తి సంఘంలో చేర్పించే విధంగా గ్రామ సంఘాలు, వీవోఏలు కృషి చేయాలని ఏపీఎం దేవరాజ్ అన్నారు. మల్యాలలో గురువారం ఇందిరా మహిళ శక్తి అంశాలపై స్వశక్తి మహిళలకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆమని, కార్యదర్శి జ్యోతి, కోశాధికారి అన్విత పాల్గొన్నారు.

'ఇళ్ల మధ్య సెల్‌టవర్ వద్దు'

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ వార్డులో ఇళ్ల మధ్య సెల్ టవర్ పనులను నిలిపి వేయించాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డికి గురువారం కాలనీ వాసులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి రీసర్వే

కథలాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంబీర్‌పూర్‌లో 570 ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా ప్రవేశించినట్టు ఫిర్యాదులు రావడంతో గురువారం తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నగేశ్ పరిశీలించారు. ఈ సర్వే నంబర్‌లో సుమారు 360 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్టు రికార్డుల్లో ఉందన్నారు. అయితే ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపన కోసం 164 ఎకరాలు కేటాయించబడిందని చెప్పారు. అయితే కొన్ని కుల సంఘాలు భూములను చదును చేసుకుని సాగు చేసుకుంటుండడంతో మూడు రోజుల కిందట వివాదాస్పదంగా మారినందున ఆ భూములను పరిశీలించినట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల్లో డిప్యూటీ సర్వేయర్‌తో రీసర్వే చేయించనున్నామని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ సత్తా చాటాలి

పెగడపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి మండలంలోని దోమలకుంటలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలుసాని నిహారిక శ్రీనివాస్, ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, రాజశేఖర్ గౌడ్, రాచకొండ ఆనంద్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించాలి

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఈనెల 18న ఘనంగా జరుపుకోవాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, గొల్లపల్లి రామ గౌడ్‌లు కోరారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్యవర్గాల ఎన్నిక

మల్యాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటలో గల నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడిగా అరవింద్, ఉపాధ్యక్షునిగా భానుప్రసాద్, కార్యదర్శిగా పొనగంటి విష్ణు, సలహాదారుగా చెట్‌పల్లి చక్రధర్ తదితరులు ఎన్నికయ్యారు.

●కొడిమ్యాల: మండల గ్రామ పంచాయతీ సిబ్బంది సంఘం అధ్యక్షుడిగా జి.దేవయ్యను సభ్యులు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా గుడిసె దేవయ్య, ఎం.వజ్రమ్మ, ప్రధాన కార్యదర్శిగా సత్తయ్య, కోశాధికారిగా రేణికుంట బాబు, సహాయ కార్యదర్శిగా ఎడవెల్లి బాబును ఎన్నుకున్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు




జగిత్యాలలోని కృష్ణవేణి స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు, కోరుట్ల ప్రభుత్వ పాఠశాలలో వివిధ వేషధారణలో విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్థానిక మానస స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ వేషధారణలతో వేడుకల్లో పాల్గొనగా, శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ రజితరావు కృష్ణాష్టమి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికరావు పాల్గొన్నారు.

●పట్టణంలోని స్థానిక మిషన్‌కాంపౌండ్‌లో గల స్లేట్ హై స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

●పట్టణంలోని బీట్‌బజారులో గల శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రావు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలో ఉట్టి కొట్టే వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**రాయికల్:** పట్టణంలోని విజ్డమ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి, డైరెక్టర్ ఎద్దండి నివేద రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** బొమ్మెనలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవి ఉన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని విన్నర్స్ ఇంగ్లీష్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ అరవింద్ పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మండలంలోని వివిధ పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. వెల్గటూర్‌లోని విజ్ఞాన్ కిడ్స్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లేశం పాల్గొన్నారు.

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



జగిత్యాలలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగార్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక టౌన్ హాల్ నుంచి పాత బస్టాండ్ వరకు డీజే సౌండ్‌తో ఈ ర్యాలీ కొనసాగించి, ముగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, మాజీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ రావు హాజరై. ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను చేతబూని బీజేపీ నాయకులు, విద్యార్థులు పట్టణంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ రుద్ర శ్రీనివాస్, బీజేపీ వివిధ హోదాల బాధ్యులు కొక్కు గంగాధర్, ఆముద రాజు, రాగిల్ల సత్యనారాయణ, నలువాల తిరుపతి, బోగ శ్రావణి, దొణికెల నవీన్‌కుమార్, పవన్‌సింగ్, పాత రమేష్, గర్శకుర్తి రమేష్, సీపతి రమేష్, కన్నం అంజయ్య, జున్ను రాజేందర్, భూమి రమణ, దుర్శెట్టి మమత, గడ్డల లక్ష్మీ తో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలో గురువారం మండల బీజేపీ నాయకుడు బండ నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో తిరంగయాత్ర కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల మైదానంలో యువతీ యువకులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగడి బజారులో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏలేటి నర్సింహరెడ్డి, చిరంజీవి, అనిల్, అంజి, నరేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

'దొంగ ఓట్లు తొలగించాలి'

జగిత్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డుతో ఓటరు కార్డును లింక్ చేసి దొంగ ఓట్లను తొలగించడానికి ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, నాయకులు జిల్లా గంగాధర్, గాజుల రాజేందర్, కొత్త మోహన్, జగదీశ్వర్, పిప్పరి అనిత పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రామకృష్ణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీఎస్ఎస్‌వి జూనియర్ కళాశాల విద్యార్థుల స్వాగతోత్సవం పట్టణంలోని స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్కే విద్యాసంస్థల అధినేత యాద రామకృష్ణ హాజరై మాట్లాడుతూ ఇంటర్ విద్య ప్రతి విద్యార్థి జీవితంలో కీలక దశ అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవడం ద్వారా విజయాలను సాధించవచ్చన్నారు. అనంతరం అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ నరేష్‌ల చేతుల మీదుగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్యప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్ పాల్గొన్నారు.

అఖండ భారత్ సంకల్ప దివస్

ధర్మపురి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అఖండ భారత్ సంకల్ప్ దివస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత ప్రాంత టోలి సభ్యులు అల్లం దుర్గప్రసాద్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కస్తూరి రాజన్న పాల్గొన్నారు.

●రాయికల్: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా సత్సంగ్ ప్రముఖ్ కాయితి గంగాధర్, మోహన్, గాజెంగి అశోక్ పాల్గొన్నారు.

'అర్బన్ కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు'


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అర్బన్ కాలనీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని త్వరలో మౌలిక వసతులు కల్పిస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. తమ నియోజక వర్గంలో 40 ఇళ్ళు కూడా కట్టలేని నాయకులు జగిత్యాలకు వచ్చి 400 ఇళ్ళ మౌళిక వసతుల పై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. జగిత్యాల పట్టణంలో గురువారం 41, 42, 43, 46 వార్డులలో కోటి 30 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే జగిత్యాల నియోజక వర్గానికి మంచి గుర్తింపు తీసుకు వస్తానని అన్నారు. జగిత్యాల పట్టణంలో 150 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అభివృద్ధితో పాటు పచ్చదనం పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. డంపింగ్ యార్డు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా జగిత్యాల నియోజక వర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. నియోజక వర్గంలో అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో 203 కోట్లతో నూతన ఆసుపత్రి మంజూరు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ స్పందన, డీఈ ఆనంద్, ఏఈ వరుణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గోలి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్, ఫిర్దోస్, బాలె శంకర్, రాజేశ్, పద్మ పాల్గొన్నారు.

కిశోర బాలికల పొదుపు మంత్రం

(5వ పేజీ తరువాయి)

వృద్ధ మహిళలుంటే చిరు వ్యాపారాలు చేసుకునేందుకు సాయం చేయడం, కొడుకులు సరిగా చూసుకోకపోతే ఆఫీసర్లకు ఫిర్యాదు చేయడంలో సంఘాలు సాయం చేయనున్నాయి. వృద్ధాప్యంలో ఒంటరిగా ఉన్నామని ఫీల్ కాకుండా నలుగురితో సంఘటితం చేయాలన్న ఉద్దేశ్యంతో ఇలాంటి సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

● కార్యాచరణ ఇలా..

జిల్లాలో కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు ఈనెల 12వ తేదీ నుంచి కార్యాచరణ ప్రారంభించారు. ఈనెల 14వ తేదీ వరకు గ్రామాల్లో ఏ సంఘాల్లో లేని మహిళలు, దివ్యాంగులు, కౌమార బాలికలను డీపీఎంలు, సీసీలు ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో గుర్తింపు పూర్తి చేశారు. ఈనెల 15వ, 16వ తేదీల్లో కొత్త సంఘాల్లో చేరితే కలిగే ప్రయోజనాల గురించి వివరించేందుకు సమావేశాలు నిర్వహిస్తారు. ప్రస్తుత సంఘాలు సాధించిన ఆర్థిక విజయాలు చెప్పడమే కాకుండా ఆయా సభ్యుల అనుభవాలు, నిబంధనలు పరిచయం చేస్తారు. 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ముందుకు వచ్చే సభ్యులతో సంఘాలు ఏర్పాటు చేసి, వారితో బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు తెరిపిస్తారు. వివరాలు సెర్ప్ వెబ్‌సైట్‌లో నమోదు చేయిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం

-రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిశోర బాలికలు, దివ్యాంగులకు, వృద్ధులకు నూతన సంఘాల్లో సభ్యత్వం కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అర్హులంతా ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలి. ప్రభుత్వ లక్ష్యం మేరకు కొత్త సంఘాల ఏర్పాటును పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

-సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

కోరుట్ల, అగస్టు 14 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం సాగిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఈనెల 20 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లా కేంద్రంలో భారత కమ్యూనిష్టు పార్టీ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. సెప్టెంబరు 11 నుంచి 17 వరకు రాష్ట్ర రైతాంగా సాయిధ పోరాట ఉత్సావాలు అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, సురేష్, ఎండి ముక్రం, హన్మంత్, కొక్కుల శాంత, ఎన్నం రాధ, వెన్న మహేష్, ఎత్తడి భూమయ్య పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా చెన్న విశ్వనాథం, సహాయ కార్యదర్శులుగా ఇరుగురాల భూమేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా వెన్న సురేష్, ఎండి ముక్రం, సుతారి రాములు, హన్మంత్, ఎన్నం రాధ, కోక్కుల శాంత, ఎండి అక్రం మాలిక్, కిరణ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మద్దుల చెరువు మత్తడి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలి

కోరుట్ల, ఆగస్టు 14: తీవ్ర వర్షాల నేపథ్యంలో పట్టణంలోని మద్దుల చెరువు మత్తడి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు అదేశించారు. గురువారం పట్టణంలోని మద్దుల చెరువును కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్‌డీఓ జీవకర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ కమీషనర్ రవీందర్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మొరం అనుమతులు ఇవ్వాలి

కథలాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ళకు ఇసుక, మొరం తరలించడానికి అనుమతులు వెంటనే ఇచ్చేలా చూడాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తహసీల్దార్‌ను ఆదేశించారు. మండల కేంద్రంలో గురువారం ఆర్‌జే అసోసియేట్స్ కార్యాలయంను ప్రారంభించిన అనంతరం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం వేగవంతంగా కొనసాగేలా చూడాలని సూచించారు. గంభీర్‌పూర్ భూముల ఆక్రమణ విషయంలో తనను ఓ వ్యక్తి దూషించినట్టు తెలిసిందని సదరు వ్యక్తిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం ఉన్నారు.

మొరం అక్రమ రవాణాను అరికట్టాలి

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకట్రావ్‌పేట గ్రామంలో ఉన్న గుండు గుట్ట నుంచి మొరం అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరుతూ గురువారం పట్టణానికి చెందిన రైతులు తహసీల్దార్ నీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు ఆకుల నరేష్, గాజ రాజన్న, ఏఎంసీ డైరెక్టర్ సంగు గంగాధర్, ఓజ్జల లింబాద్రి, సుతారి బాలరాజ్, అరిగెల రెడ్డి, అరిగెల లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ

ధర్మపురి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దమ్మన్నపేట గ్రామంలో గల వివేకానంద యువజన సంఘం, హెచ్ఎం ఆసం శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో ఎంపీపీఎస్ విద్యార్థులకు షూస్, టై, బెల్టులు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీతాలక్ష్మి, కాంప్లెక్స్ హెచ్ఎం బాచంపెల్లి సంతోష్, ముత్యాల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి నది వరద గురువారం సాయంత్రం ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి నీరు నదిలో చేరింది. ప్రస్తుతం గోదావరి నదీ మంగళిగడ్డ, సంతోషీమాత, సోమవిహార్ స్నానఘట్టాలు ఆనుకొని నీటి ప్రవాహం కొనసాగుతోంది. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు.

ఘనంగా భీష్ముడి విగ్రహావిష్కరణ

రాయికల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చెర్లకొండాపూర్‌లో గంగపుత్ర భీష్మ పితామహ విగ్రహావిష్కరణ గురువారం జరిగింది. కార్యక్రమంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

రాయికల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం రాయికల్ పట్టణంలోని 10వ వార్డులో ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటి, వార్డు ఆఫీసర్ ఎండీ రజాఖ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సారంగాపూర్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి) :మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సారంగాపూర్ ఎస్సై గీత అన్నారు. రేచపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిరోధక పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

రాయికల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని డీఈవో రాము అన్నారు. మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 పదవ తరగతి విద్యార్థులు చందాలు వేసుకుని విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, బాస్కెట్‌బాల్ కోర్టును గురువారం ప్రారంభించారు. సహకరించిన గొడ్డండ్ల రాజగోపాల్, మ్యాలపు మురళిలను డీఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి'


గోదావరి నదీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని గోదావరి నదీ ప్రాంతాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పెరుగుతున్న నదీ నీటి ప్రవాహాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. నదీ వద్ద ప్రస్తుత నీటి మట్టం, ప్రవాహ వేగం, సేఫ్టీ బారికేడ్లు, రక్షణ చర్యలను పరిశీలించారు. ఆయన వెంట ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రవీందర్, ఆలయ ఈవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాంతియుతంగా గణేష్ నవరాత్రులు జరుపుకోవాలి

జగిత్యాల క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) :ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవ రాత్రులు జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు అదేశాల మేరకు అధిక స్థాయిలో శబ్ద కాలుష్యాన్ని సృష్టించే డీజేలు, సౌండ్ సిస్టంలు పూర్తి స్థాయిలో నిషేదమని పేర్కొన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సహకరించి నియమ నిబంధనలు పాటించాలన్నారు.

యూరియా కోసం రైతుల బారులు


కోరుట్ల మండలంలో యూరియా కోసం గోదాం వద్ద గుమికూడిన రైతులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 14: యూరియా కోసం గురువారం రైతులు బారులు తీరారు. సింగిల్ విండో అధికారులు విండో గోదాంలకు యూరియాను తరలించి పంపిణీకి సిద్ధం చేశారు. గురువారం ఉదయం యూరియా వచ్చిన విషయం తెలుసుకున్న రైతులు గోదాం వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. చిన్నమెట్‌పల్లి సింగిల్‌విండో పరిధిలోని మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి, మాదాపూర్ సింగిల్‌విండో పరిధిలోని మాదాపూర్, కల్లూర్, ఎఖీన్‌పూర్ పరిధిలోని ఎఖీన్‌పూర్, నాగులపేట, అయిలాపూర్ సింగిల్ విండో పరిధిలోని అయిలాపూర్, యూసుఫ్‌నగర్, పైడిమడుగు సింగిల్ విండో పరిధిలోని పైడిమడుగు, జోగినిపల్లి గ్రామంలోని సింగిల్ విండో గోదాంల వద్ద రైతులు రావడంతో సందండిగా మారింది. ఎలాంటి అవంచనీయ సంఘటనలు చోటు చేసుకో కుండా పోలీసులు, అధికారులు చర్యలు తీసుకున్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట గురువారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. యూరియా కోసం వచ్చిన రైతులు పాస్ మిషన్ ద్వారా యూరియా రసీదు పొందుటకు కార్యాలయంలో వేచియున్నారు. యూరియా కోసం వచ్చిన రైతులకు సంబంధిత అధికారులు సిబ్బంది ఆదార్‌కార్డుతో పాస్ మిషన్‌లో ఎంట్రీ చేసి రసీదులను అందించారు. కొడిమ్యాల ఏవో పి.జ్యోతి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మండలంలోని 17పాయింట్లలో ఇప్పటి వరకు 949.44 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశామన్నారు. యూరియా కొరత లేదని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

బీర్‌పూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం గోండుగూడెంలో గురువారం పలువురు నాయకులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్దన్ అన్నారు. గురువారం పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల మారిన నూతన చట్టాలకు సంబంధించిన క్రిమినల్ లా బుక్స్‌ని జూనియర్ న్యాయవాదులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గజేల్లి రాందాస్ పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

●మల్యాల: బీజేపీ ఆధ్వర్యంలో ముత్యంపేటలో గురువారం విభజన గాయాల స్మారక దినం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సామ మహిపాల్‌రెడ్డి, సంగని రవి, పన్నాటి మల్లేశం, సంత శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

●కొడిమ్యాల: గ్రామ పచాయతీ సిబ్బందికి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయు జిల్లా కో కన్వీనర్ కోమటి చంద్ర శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మండల పంచాయతీ సిబ్బంది సమావేశం నిర్వహించారు

●రాయికల్: సీపీఎస్ రద్దు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నా పోస్టర్‌ను రాయికల్ పట్టణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేష్, రాష్ట్ర కార్యదర్శి గాజెంగి రాజేశం, లక్కాడి రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి దొంతి సతీష్ పాల్గొన్నారు.